

రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు




- జిల్లాలో ఇప్పటి వరకు 4లక్షల 72వేల 332 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు
- రైతుల ఖాతాల్లో 957 కోట్ల రూపాయల జమ
- జిల్లా వ్యాప్తంగా డిఫాల్టర్ల మిల్లుల్లో కొనసాగుతున్న తనిఖీలు



నిజామాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు రికార్డు స్థాయిలో చేశారు. గత సంవత్సరం కంటే ఈ సీజన్‌లో ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేశారు. మరో వారం రోజుల్లోగా కొనుగోళ్లను పూర్తి చేసే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ సీజన్‌లో ఎక్కువ మొత్తంలో సన్నరకాలను కొనుగోళ్లను చేశారు. ధాన్యం కొనుగోళ్లతో పాటు చెల్లింపులు కూడా పూర్తి చేస్తున్నారు. వెంటనే రైతులకు బోనస్‌ను వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే కొన్ని కొనుగోలు కేంద్రాలను మూసివేయగా మిగతా ధాన్యాన్ని కొను గోలు చేసేందుకు చర్యలను తీసుకుంటున్నారు. ధాన్యం సేకరించడంతో పాటు వాటిని మిల్లులకు తరలిస్తున్నారు. రైతులకు ఆలస్యం లేకుండా డబ్బులు అందేవిధంగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డిఫాల్ట్ ఉన్న మిల్లుల్లో ధాన్యం కేటాయింపులను నిలిపివేయడంతో పాటు తనిఖీలను కొనసాగిస్తున్నారు. రాష్ట్రస్థాయి బృందాలతో పాటు జిల్లాస్థాయి అధికారులు ఈ తనిఖీలను కొనసాగిస్తున్నారు.

జిల్లాలో ధాన్యం కొనుగోలు చేపట్టి నెలరోజులు దాటింది. ఈ సీజన్‌లో మాత్రం ఆలస్యంగా కొనుగోలు మొదలు పెట్టిన నెలరోజుల్లో గత సీజన్ కంటే ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేశారు. సన్నరకాలతో పాటు దొడ్డురకాలకు కొనుగోలు కేంద్రాలను వేరువేరుగా ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 670 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఈ ధాన్యాన్ని సేకరించారు. ప్రస్తుతం మెజార్టీ కేంద్రాలను మూసివేయగా 176 కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 4లక్షల 72వేల 332 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. గత సంవత్సరం వానాకాలంలో 4లక్షల 19వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం దాదాపు 53వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేశారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో ఈ సీజన్‌లో సన్నరకాలనే ఎక్కువ మొత్తంలో రైతులు సాగు చేశారు. జిల్లాలో 3లక్షల 5,414 మెట్రిక్ టన్నుల సన్నరకాలను కొనుగోలు చేయగా ఒకలక్షా 66వేల 918 మెట్రిక్ టన్నులు దొడ్డురకాలను కొనుగోలు చేశారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో రైతులు కూడా ఎక్కువ మొత్తం ఈ దఫా సన్నరకాలను కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మకం చేశారు.

నెలరోజులుగా కొనుగోళ్లు

జిల్లాలో నెలరోజుల్లో ఎక్కువ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రికార్డు స్థాయిలో ఈ ధాన్యాన్ని కొన్నారు. కొనుగోలు రీతిలోనే ధాన్యాన్ని తరలించడంతో పాటు ట్యాబ్ ఎంట్రీ కూడా అదే రీతిలో చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 1095 కోట్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో రైతుల వివరాలను నమోదు చేయడంతో పాటు 957 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఏరోజు కొన్న ధాన్యాన్ని ఆరోజే మిల్లులకు తరలించడంతో పాటు ట్యాబ్ ఎంట్రీ చేసే విధంగా చూడటంతో రైతుల ఖాతాల్లో నిర్ణీత సమయంలోనే డబ్బులను జమ చేశారు. రైతుల ఖాతాల్లో మద్దతు ధరకు అనుగుణంగా డబ్బులు జమ చేయడంతో పాటు బోనస్‌ను కూడా ఖాతాల్లో జమ చేస్తున్నారు. క్వింటాలుకు 500 రూపాయల చొప్పున ఈ డబ్బులను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 31వేల 682 మంది రైతులకు 116.29 కోట్ల రూపాయలను బోనస్ కింద రైతుల ఖాతాల్లో జమ చేశారు. ప్రతీరోజు కొన్ని వేల మంది రైతులకు ఈ బోనస్‌ను జమ చేస్తున్నారు. పౌర సరఫరాల సంస్థ నుంచి ధాన్యం కొనుగోలు చేసిన రైతుల వివరాలు రాగానే ఆ శాఖ ద్వారా ఈ బోనస్ డబ్బులను జమ చేస్తున్నారు.

డిఫాల్టర్ల మిల్లుల్లో తనిఖీలు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను చేస్తుండటంతో పాటు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా డిఫాల్టర్ల మిల్లుల్లో తనిఖీలను కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 30 మిల్లుల్లో ఈ తనిఖీలను చేస్తున్నారు. ధాన్యం నిల్వలను సరిచూడటంతో పాటు పూర్తిస్థాయి నిల్వలు ఉన్నాయా అని పరిశీలిస్తున్నారు. ఈ మిల్లులకు 2023లో కేటాయించిన ధాన్యం నిల్వలను పరిశీలించడంతో పాటు నివేదికలను సిద్ధం చేస్తున్నారు. డిఫాల్ట్ మిల్లుల్లో ధాన్యం నిల్వలు లేనివాటిపై చర్యలు చేపట్టేందుకు నిర్ణయం తీసుకుంటున్నారు. ఏరోజుకు ఆరోజు ఆ మిల్లుల వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేస్తున్నామని మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్, పౌరసరఫరాల శాఖ అధికారి అరవిందరెడ్డిలు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లతో పాటు రైతులకు వారి ఖాతాల్లో డబ్బులను జమ చేస్తున్నామని తెలిపారు.

టౌన్‌ప్లానింగ్ విభాగంలో

సిబ్బంది కొరత

- డిప్యూటేషన్‌లో కొందరు ఉద్యోగుల విధులు
- బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ ఒక్కరు కూడా లేరు
- సిబ్బంది లేకపోవడంతో పనుల్లో ఆలస్యం



సుభాష్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగర పాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. సగానికి సగం సిబ్బంది లేకపోవడంతో టౌన్ ప్లానింగ్ విభాగంలో బిల్డింగ్ అనుమతులు, ఇతరత్రా పనులు ఆలస్యం అవుతున్నాయి. నిజామాబాద్ నగర పాలక సంస్థ ఏర్పడి రెండు దశబ్దాలు అవుతున్నా సిబ్బంది నియామకంలో మాత్రం ఏమార్పు లేదు. దీనికి తోడు 'నుడా' సైతం ఏర్పడి మరింత భారం పడింది. నగరపాలక సంస్థలో 60 డివిజన్‌లు ఉండగా సుమారు 4లక్షలకు పైగా జనాభా ఉంది. దీనికి సరిపడా ఉద్యోగులు మాత్రం టౌన్‌ప్లానింగ్ విభాగంలో లేరు. కనీసం ఉండాల్సిన ఉద్యోగుల సంఖ్యకంటే తక్కువగా ఉండటంతో పనులు జరగడం లేదు. ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన ఎల్ఆర్ఎస్ పథకానికి 33వేల అప్లికేషన్‌లు వచ్చాయి. కేవలం 1500 అప్లికేషన్‌లు మాత్రమే అప్రూవల్ అయ్యాయంటే సిబ్బంది కొరత ఏ విధంగా వేధిస్తుందో అర్థం చేసుకోవచ్చు. దీనికితోడు కొందరు ఉద్యోగులు డిప్యూటేషన్ మీద ఇతర చోట మూడు రోజులు, నగర పాలక సంస్థలో మూడు రోజులు పనులు చేస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు బదులు కొందరిని కాంట్రాక్టు పద్ధతిన నియమించుకొని నగర పాలక సంస్థ తమ పనులను చేపడుతోంది.

సిబ్బంది అంతంత మాత్రమే..

టౌన్‌ప్లానింగ్ విభాగంలో సిబ్బంది ఉండాల్సినంత ఉద్యోగులు లేరు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు ఏడుగురు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేరు. టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్లు ఐదుగురు ఉద్యోగులు ఉండాల్సి ఉండగా కేవలం ఇద్దరు ఉద్యోగులతో సరిపెట్టుకుంటున్నారు. ఇందులో ఇద్దరు ఇతర చోట్ల మూడు రోజులు, ఇక్కడ మూడు రోజులు పనిచేస్తున్నారు. అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్లు ఇద్దరు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేరు. డిప్యూటీ సిటీప్లానర్ ఒక్కరు ఉండగా నుడాలో ఇన్‌చార్జిగా ఉన్నారు. ఇక్కడ మూడు రోజులు, నుడాలో మూడు రోజులు పనిచేస్తున్నారు. సిబ్బంది తగినంత లేక పోవడంత ఉన్న సిబ్బందిపై భారం పడుతోంది. ముందే టౌన్ ప్లానింగ్ విభాగంపై అనేక ఆరోపణలు ఉండటంతో డబ్బుల కోసమే పనులు చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సిబ్బంది కొరత కూడా వేధించడంతో పనులు ఆలస్యమవుతుందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అవసరమైన సిబ్బందిని నియమించాలని ఉద్యోగులు కోరుతున్నారు.



స్థానిక సంస్థల నిధులకు గ్రహణం 5

- పనులు పూర్తి చేసినా బిల్లులు పెండింగ్‌లోనే..
- నిధుల లేమితో కుంటుపడిన గ్రామీణాభివృద్ధి పనులు
- కొత్త ప్రభుత్వంలో మంజూరు కాని నిధులు
- చేసిన పనులకు బిల్లులు లేక లబోదిబోమంటున్న కాంట్రాక్టర్లు 5



ఎన్నాళ్లీ తిప్పలు!? 5

- డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో కరెంటు కటకట
- కరెంటు లేక చీకటి గృహాల్లోనే నివసిస్తున్న లబ్ధిదారులు
- మురుగు కాల్వలు లేక అవస్థలు
- పట్టించుకోని అధికారులు

బోధన్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలబెడతా 6

- అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



డీసీసీబీలో

రూ.2వేల కోట్లకు చేరిన వ్యాపారం

నిజామాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ వ్యాపారంలో రికార్డు స్థాయికి చేరింది. ఉమ్మడి జిల్లా పరిధిలో వ్యాపార లావాదేవీల్లో 2వేల కోట్ల రూపాయలను దాటింది. బ్యాంకు శాఖల పరిధిలో జరిగే వ్యాపార లావాదేవీల వల్ల ఈ రికార్డుకు చేరింది. ఈ బ్యాంక్ పరిధిలో వ్యాపారం 2వేల కోట్ల రూపాయలకు చేరగా డిపాజిట్లు 794 కోట్ల రూపాయలకు చేరాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో పంట రుణాలు 600 కోట్ల రూపాయలు ఇవ్వగా బంగారు ఆభరణాలపై 317 కోట్ల రూపాయలను ఇచ్చారు. ఇతర రుణాలను బ్యాంకు పరిధిలో 313 కోట్ల రూపాయల వరకు అందజేశారు. ప్రభుత్వం చేసిన రుణమాఫీ వల్ల ఉమ్మడి జిల్లా పరిధిలోని బ్యాంకుల పరిధిలో ఉన్న 40654 మంది రైతులకు 169.73 కోట్ల రూపాయల లబ్ధి చేరింది. రుణమాఫీ అయిన రైతులకు మళ్లీ 160 కోట్ల రూపాయల వరకు రుణాలను మంజూరు చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో వ్యాపార లావాదేవీలు 2వేల కోట్లకు చేరడంతో బ్యాంక్ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర కార్యాలయంలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ వైస్‌చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు రమేష్ పాటిల్, ఆనంద్, యాదగిరి, సీఈవో నాగభూషణం, జీఎం అనుపమ, అసిస్టెంట్ జీఎం సుమ మాల పాల్గొన్నారు. అందరి కృషి వల్లనే ఇది సాధ్యమైందని బ్యాంక్ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ సహకారం తీసుకొని బ్యాంకు లావాదేవీలను పెంచడంతో పాటు రైతులకు మరింత చేరువగా తీసుకుపోతామని ఆయన తెలిపారు.

సీఎం కప్ షెడ్యూల్ విడుదల

7 నుంచి జనవరి 2 వరకు పోటీలు

సుభాష్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఈనెల 7 నుంచి జనవరి 2 వరకు వివిధ స్థాయిలో సీఎం కప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల విభజన క్రీడల శాఖ అధికారి ముత్తెన్న తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటి విజేతకు రూ.లక్ష, రెండో విజేతకు 75వేలు, మూడో విజేతకు 50వేల నగదు అందజేస్తున్నట్లు తెలిపారు. వ్యక్తిగత క్రీడాంశాల్లో మొదటి విజేతకు 20వేలు, రెండో విజేతకు 15వేలు, మూడో విజేతకు 10వేల రూపాయలు అందజేయనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం, పదో తరగతి మెమో, ఆధార్‌కార్డు తప్పనిసరిగా వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. డిసెంబర్ 7 నుంచి 8వ తేదీలో రెండు రోజుల పాటు గ్రామ పంచాయతీస్థాయి క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అథ్లెటిక్స్, ఫుడ్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా పోటీలు నిర్వహించి విజేతలను మండల స్థాయికి పంపడం జరుగుతుందన్నారు. ఈ పోటీలకు గ్రామ పంచాయతీ సెక్రెటరీ చైర్మన్‌గా హెడ్‌మాస్టర్, ప్రిన్సిపాల్ కన్వీనర్‌గా, నాలుగు సీనియర్ ప్లేయర్ వీఆర్‌వోలు, వీఆర్ఏలు సభ్యులుగా ఉంటారని అన్నారు. మండల, మున్సిపాలిటీ స్థాయి క్రీడలు డిసెంబర్ 10 నుంచి 12వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఉంటాయన్నారు. మండల స్థాయి పోటీలో గెలుపొందిన వారిని జిల్లాస్థాయి పోటీల కు పంపనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు మండల స్పెషల్ ఆఫీసర్ చైర్మన్‌గా ఎంపీడీవో కన్వీనర్‌గా ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సీనియర్ సభ్యులు ఉంటారని అన్నారు. మున్సిపాలిటీ స్థాయి కమిటీలో మున్సిపల్ చైర్మన్‌గా మున్సిపల్ కమిషనర్ కన్వీనర్‌గా ఉంటారని అన్నారు. జిల్లాస్థాయి పోటీలు డిసెంబర్ 16 నుంచి 21 వరకు ఆరు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి మెరిట్ సర్టిఫికెట్‌తో పాటు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు డిసెంబర్ 27 నుంచి జనవరి 2 వరకు ఏడు రోజుల పాటు హైదరాబాద్‌లో జరిగే క్రీడలకు పంపనున్నట్లు తెలిపారు.



యాసంగి ప్రణాళిక ఖరారు

- ఈనెల 25 నుంచి ఎస్సారెస్పీ ఆయకట్టుకు నీటి విడుదల
- హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో నిర్ణయం
- ప్రాజెక్టు పరిధిలో మొత్తం ఆయకట్టుకు నీటిని అందించేందుకు ఏర్పాట్లు
- మొత్తం 12లక్షల ఎకరాలకు అందనున్న సాగునీరు

నిజామాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నుంచి యాసంగి సాగుకు నీటిని అందించేందుకు ప్రణాళికను ఖరారు చేశారు. ఈనెల 25 నుంచి ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టు పరిధిలోని మొత్తం ఆయకట్టుకు నీళ్లు అందించనున్నారు. ఆన్ ఆఫ్ పద్ధతిలో ఏప్రిల్ రెండవ వారం వరకు నీటిని విడుదల చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టు పరిధిలోని కాలువతో పాటు ఎత్తిపోతల పథకాల పరిధిలో సాగునీరు అందించనున్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకోవడంతో పాటు ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి మట్టం ఉండటంతో మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రాజెక్టులపై సమీక్ష

రాష్ట్రంలోని ప్రాజెక్టుల నుంచి యాసంగి సాగుకు నీటిని విడుదల చేసేందుకు హైదరాబాద్‌లో మంగళవారం సమావేశం జరిగింది. సాగునీటి శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎస్సారెస్పీ, నిజాంసాగర్‌తో పాటు మొత్తం ప్రాజెక్టులపై సమీక్షించారు. ఈ సమావేశంలో అన్ని ప్రాజెక్టుల పరిధిలోని సీఈలు, ఎస్ఈలు సమావేశానికి హాజరయ్యారు. ప్రాజెక్టుల కెపాసిటీకి అనుగుణంగా ఉన్న నీటివనరులపై చర్చించారు. ఈ నీటివనరుల ఆధారంగా ఒక్కొక్క ప్రాజెక్టు పరిధిలో ఎంత మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించాలో నిర్ణయం తీసుకున్నారు. ఆ నిర్ణయానికి అనుగుణంగా షెడ్యూల్ ప్రకారం యాసంగి సాగుకు నీటి విడుదల చేయనున్నారు. అన్ని ప్రాజెక్టుల పరిధిలో ఆన్ ఆఫ్ పద్ధతిలో మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించే విధంగా ప్రణాళికను రూపొందించారు.

ఎస్సారెస్పీలో 80 టీఎంసీల నీరు

ఎస్సారెస్పీ పరిధిలో మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఎస్సారెస్పీతో పాటు లోయర్ మానేరు డ్యామ్ పరిధిలో నీటి నిల్వలను బట్టి మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించనున్నారు. ఎస్సారెస్పీలో ప్రస్తు తం 80 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. పూర్తి కెపాసిటీలో నీటిమట్టాలు ఉన్నాయి. ఎల్ఎండిలో 24 టీఎం సీల నీళ్లు ఉన్నాయి. ఈ రెండు ప్రాజెక్టులను కలిపి మొత్తం 12లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఎస్సారెస్పీ పరిధిలో ఎల్ఎండీ ఎగువన 6లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. కాకతీయ కాలువతో పాటు సరస్వతి, లక్ష్మి కాలువల పరిధిలోని ఆయకట్టుకు నీటిని అందించనున్నారు. ఇవేకాకుండా ప్రాజెక్టు పరిధిలోని గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాలకు సాగునీరు అందించనున్నారు. ఈ ప్రాజెక్టు పరిధిలో ఎల్ఎండీ ఎగువన ఈనెల 25 నుంచి యాసంగి సాగుకు నీటిని విడుదల చేసేందుకు హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. రైతులు వేసే పంటల ఆధారంగా నీటిని ఆన్ ఆఫ్ పద్ధతిలో విడుదల చేయనున్నారు. పది రోజుల పాటు నీటిని విడుదల చేసి వారం రోజుల పాటు నిలిపివేయనున్నారు. కాకతీయ కాలువతో పాటు ఇతర కాలువలకు కూడా ఇదే విధానాన్ని అవలంబించనున్నారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం ఉండటంతో ఈఎన్‌సీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేసిన వారం రోజుల తర్వాత ఎల్ఎండీ పరిధిలోని ఆయకట్టుకు నీటిని విడుదల చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఎల్ఎండి దిగువన జనవరి మొదటి వారంలో నీటిని విడుదల చేయనున్నారు. కాకతీయ కాలువ పరిధిలో ఎల్ఎండి దిగువన 6లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. మొత్తం ఆయకట్టు కోసం ఎస్సారెస్పీ నీటిని వినియోగించుకునే విధంగా ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. తాగునీటి కోసం వచ్చే ఆగస్టు వరకు నీటి నిల్వలు ఉంచడంతో పాటు మిగతా నీటిని సాగుకు విడుదల చేసే విధంగా ప్రణాళికలను రూపొందించారు. వానాకాలం లాగానే యాసంగిలో కూడా మొత్తం సాగుకు సాగునీరు అందించే విధంగా ఈ ఏర్పాట్లను చేయనున్నారు. రాష్ట్ర స్థాయిలో అన్ని ప్రాజెక్టుల పరిధిలో యాసంగి సాగుపై చర్చ జరిగిందని నీటి నిల్వల ఆధారంగా ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు నిర్ణయం తీసుకున్నారని ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్‌గుప్త తెలిపారు. సమావేశంలో జరిగిన నిర్ణయానికి అనుగుణంగా ఈనెల 25 నుంచి ఆయకట్టుకు నీటి విడుదలను చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఆన్ ఆఫ్ పద్ధతిలో ఈ నీటి విడుదలను కొనసాగిస్తామని అన్నారు. ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు అంతటికి సాగునీరు అందిస్తామని తెలిపారు.

రెంజల్ కస్తూర్బా గాంధీ పాఠశాల తనిఖీ



రెంజల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ అశోక్

రెంజల్,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను మంగళవారం డీఈవో అశోక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందించే ఆహారాన్ని వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వంట గదిలో భద్రపర్చిన కూరగాయలను పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వంట చేపడుతున్న సిబ్బందిని అభినందించారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సిలబస్ ఎంత వరకు పూర్తయిందని అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని అన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి మెరుగైన విద్యను అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరు సమయ పాలన పాటించాలన్నారు. ఆయన వెంట ప్రత్యేక అధికారిణి శ్యామల, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

అధికారుల సూచనలు పాటించాలి



జన్నేపల్లి రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్

నవీపేట,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్ కోరారు. మంగళవారం మండలంలోని జన్నేపల్లి రైతు వేదికలో జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన రైతులందరికీ 2లక్షల రూపాయల రుణమాఫీని అమలు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. యాసంగి పంటల సాగుకు సంబంధించి రైతులతో మాట్లాడి వారికి తగిన సూచనలు చేశారు. అంతకు ముందు మండలంలోని నాగేపూర్‌లో యాసంగి పంటల సాగుకు సంబంధించి రైతులతో మాట్లాడి సెల్ఫీ ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో ఏవో నవీన్ కుమార్, సంజీవ రావు, వీరేందర్ రావు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్ల రాక్షస పాలనకు చరమగీతం



మాట్లాడుతున్న రాష్ట్ర కోఆపరేటీవ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి

భీమ్‌గల్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొమ్మిదేళ్ళు నిర్బంధ రాక్షస పాలనకు కాంగ్రెస్ పార్టీ చరమగీతం పాడిందని రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు స్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పదేళ్ల కేసీఆర్ హయంలో కల్లబొల్లి మాటలతో నిర్బంధ పాలనతో ప్రజలు విసుగుచెందారని, కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సరంలో సంక్షేమ ఫలాలను అందించడం ప్రజల మొహంలో చిరునవ్వు చూస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహిళలు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. కానీ కేంద్రంలో మోదీ రాష్ట్రంలో కేసీఆర్ 410 ఉన్న సిలిండర్‌ను 2024వరకు రూ.1200వరకు పెంచి రాష్ట్ర ప్రజలపై పెనుభారం మోపారన్నారు. ఆరోగ్యశ్రీని కేసీఆర్ అపహాస్యం చేశారని కానీ కాంగ్రెస్ పార్టీ ప్రజారక్షణ కోసం రెండు లక్షల ఉన్న ఆరోగ్యశ్రీని రూ.5లక్షలకు పెంచి ఆదుకుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ సన్నరకానికి అందిస్తున్న బోనస్‌పై రైతులను అయోమయానికి గురి చేసి నష్టపోయే విధంగా చేసిన ఘనత బీఆర్ఎస్ నాయకులదన్నారు పదేళ్ళ కాలంలో బీఆర్ఎస్ రూ.400కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించగా గడిచిన ఒక్క ఏడాదిలోనే రూ.887కోట్లు అందించి ప్రజా ప్రభుత్వంగా ముందుకు పోతుందన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు స్వామి, కాంగ్రెస్ నాయకులు కన్నె సురేందర్, కుంట రమేష్, గోపాల్‌నాయక్, నాగేంద్ర, చరణ్, రాజు, శివ్వ అశోక్, సుంకరి సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు పరుస్తున్న ఘనత కాంగ్రెస్‌దే

● బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి

బోధన్‌రూరల్,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు పరుస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వందేనని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి అన్నారు. మంగళవారం ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా మంగళవారం బోధన్ మున్సిపల్ కార్యాలయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, మెప్మా శ్రీనివాస్, పట్టణ సీఐ వెంకట నారాయణ, ఏఈ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు శరత్ రెడ్డి, పిట్ల సత్యం, శ్రీకాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరులో దొంగల బీభత్సం

కోటగిరి, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలో సోమవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. వైన్స్ షాపులో, అంగన్ బజార్‌లోని షేక్ వహీద్ కిరాణ షాపులో, ఓ హోటల్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. వైన్స్ షాపు వెనుక భాగాన రేకులను కత్తిరించి లోపలికి చొరబడ్డారు. వైన్స్‌లో మందు బాటిళ్లతో పాటు సుమారు రూ.60వేల నగదును చోరీ చేశారు. కిరాణ షాపులోనూ గోడను పగులగొట్టి సిగరేట్ డబ్బాలు, సుమారు 5వేల రూపాయల నగదు చోరీ చేశారు. అనంతరం హోటల్‌లోనూ చొరబడ్డారు. బాధితులు ఉదయం తమతమ షాపులను పరిశీలించే సరికి వస్తువులు చిందర వందరగా పడి ఉండడంతో పాటు నగదు మాయమవ్వడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాలను రుద్రూరు సీఐ కృష్ణ, ఎస్ఐ సాయన్నలను పరిశీలించి కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీలను పరిశీలించి నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు.



వైన్స్ వెనుకల రేకులు కట్ చేసిన దృశ్యం

యువతి ఆత్మహత్య

బోధన్‌రూరల్,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగెం గ్రామానికి చెందిన సుంకరి మనీషా(18)అనే యువతి జీవితంపై విరక్తి చెందిన ఆత్మహత్య చేసుకుందని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం యువతికి చిన్నతనం నుంచి తల్లిదండ్రులు లేకపోవడంతో మనస్తాపం చెంది జీవితంపై విరక్తితో సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

పేకాట స్థావరంపై దాడి

● 13మంది పేకాట రాయుళ్ల అరెస్టు

బోధన్‌రూరల్,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని సాలంపాడ్ గ్రామంలో రహస్య స్థావరంలో పేకాట ఆడుతున్న పేకాట రాయుళ్లను మంగళవారం సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి పేకాట రాయుళ్లను పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. పేకాట స్థావరంపై దాడి చేయగా 13మంది పేకాట రాయుళ్లను పట్టుకుని 59,400రూపాయలను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. పేకాట ఆడిన వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఎవరైనా పేకాట ఆడిన, పేకాట నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉమ్మడి జిల్లా అంతటా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం



నందిపేటలో దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు



నవీపేటలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో



కమ్మర్‌పల్లిలో..

వేల్పూర్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలోని విద్యావనరుల కార్యాలయంలో మంగళవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగులకు ప్రభుత్వం ద్వారా అందే సదుపాయాలు, సౌకర్యాలను ఎంపీడీవో బాలకిషన్, ఎంఈవో రేణుకలు వివరించారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకా లను అర్హులైన వికలంగులు వినియోగంచుకోవాలని వారు సూచించారు. వికలాంగుల పిల్లలు ఎందులో కూడా తక్కువ కారని, వారికి అన్ని విధాలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. వికలాంగులకు నిర్వహిం చిన వివిధ ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు శైలజ, మౌళిక, ఫిజియోథె రఫీస్ట్ అరుణ, కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజన్న, తదితరులు ఉన్నారు.

ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రంలో గల భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల దివ్యాంగులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. దివ్యాంగ విద్యార్థులకు క్రీడలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఇంచార్జీ మండల విద్యాధికారి సాయిలు, ఉపాధ్యాయులు దివ్యాంగుల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నంది పేట:నందిపేట మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మండల ప్రత్యేక అధికారి జగన్నాథచారి, ఎంపీడీవో శ్రీనివాస్ రావు, మండల తహసీల్దార్ రాజ్‌కుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయు నాయకులు కిషన్, భూషణ్, రమేష్, భవిత కేంద్రం టీచర్‌లు సురేష్, స్వప్న, ఎంఆర్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలోని దర్యాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో డీఈవో అశోక్, జిల్లా సమ్మిళిత విద్యకోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు, ఎంఈవో అశోక్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, మండల పీఆర్‌టీయూ అధ్యక్షులు భూమయ్య, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: మండలంలోని సాటాపూర్ గ్రామంలో గల భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దివ్యాంగ విద్యార్థులకు క్రీడలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, నీలా కాంప్లెక్స్ హెచ్‌ఎం శంకర్, విజయ్ కుమార్, ముత్యామ్మ, భూమయప్ప, సాగర్, రవి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: దివ్యాంగుల లోని ప్రతిభను వెలికి తీయడమే ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం అని కమ్మర్‌పల్లి ఎంఈవో ఎన్ ఆంధ్రయ్య అన్నారు. మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలకేంద్రంలోని భవిత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతు దివ్యాంగులను సకలాంగులుగా తీర్చిదిద్దడానికి భవిత పాఠశాల ద్వార అనేక కార్యక్రమాలను చేపడుతున్నదని అన్నారు. దివ్యాంగులను భవిత పాఠశాకు తీసుకువస్తున్న వారి తల్లిదండ్రులకు ప్రయాణ భత్యంతో పాటు అలవెన్సులు అందజేస్తు అనేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భవిత పాఠశాల హెచ్ ఎం సీహెచ్ బాలయ్య, డిక్టర్ విశ్వనాథ్, బి మధుశేఖర్, మండల పీఆర్టీయూ అధ్యక్షుడు చంద్రశేఖర్, రాజేశ్వర్, శ్యామల, సీఆర్పీలు అంజయ్య రాజేష్, ఎం అంజయ్య, సురేందర్, ప్రవీన్, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు అటలు, పాటల తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు

బాన్సువాడటౌన్:పట్టణంలోని భవిత భవన్‌సెంటర్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పిల్లలకు ఆటపోటీలను నిర్వహించారు. అదేవిధంగా తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్నినిర్వహించారు.ఆటపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల్‌నోడల్ అధికారి విజయ్, ఎంఐఎస్ భానుప్రసాద్,ఉపాధ్యాయులు వసంత్‌కుమార్,అనిల్‌కుమార్ తదితరులున్నారు.

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో విద్యావనరుల కేంద్రంలో సమగ్ర శిక్ష విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం దివ్యంగ విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. అనంతరం గెలుపొందిన దివ్యంగ విద్యార్థులకు ఎంపీడీవో సతీష్‌కుమార్, ఎంఈవో శ్రీనివాస్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, లింగన్న, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం అంత ర్జాతీయ దివ్యంగుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దివ్యంగుడైన గుగులోత్ తిరుపతినాయక్‌ను పట్టుశాలువతో సన్మానించారు. దివ్యంగులకు తగిన ప్రాధాన్యతను ఇచ్చి వారి రిజర్వేషన్‌లలో ఇబ్బందులు కలుగకుండా సహకరిస్తామని, రాజకీయాల్లో సైతం తమ శక్తి సామార్థ్యాలు నిరుపించుకునేలా ప్రోత్సహిస్తామని బీజేపీ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్, పట్టణ ప్రధానకార్యదర్శి పులి యుగందర్, దోండి ప్రకాష్, కలిగోట ప్రశాంత్, ఉదయ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడలో..



ఎడపల్లిలో..



వేల్పూర్‌లో..

తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన వీరుడు



ఎల్‌బీనగర్‌లో నివాళి అర్పిస్తున్న బాన్సువాడ మలిదశ ఉద్యమకారులు



నందిపేటలో..

బాన్సువాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమానికి ఊపిరి పోసి తెలంగాణ రాష్ట్రం సాధించేందుకు ఆత్మ బలిదానం చేసుకున్న వీరుడు దాసోజు శ్రీకాంత్ చారి అని బాన్సువాడ మండల మలిదశ ఉద్యమకారులు కొనియాడారు. మంగళవారం బాన్సువాడ మండల మలి దశ ఉద్యమకారుల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్ చౌరస్తాలో తెలంగాణ మలి దశ ఉద్యమకారుడు దాసోజు శ్రీకాంత్ చారి 15వ వర్ధంతి సందర్భంగా బాన్సువాడ మలి దశ ఉద్యమకారుల పక్షానా వారికి నివాళులర్పించడం జరిగింది. నేను సైతం ప్రపంచానికి సమిధ నొక్కటి ఆహుతిచ్చాను అని శ్రీశ్రీ అన్నట్లు తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసి ఉద్యమానికి ఆయువు పోసిన అమరుడా నీ త్యాగాలను మేము మరువం అమరుడా శ్రీకాంతుడా ఆవేశం ఆపుకోలేక ఆక్రోశం చూపియలేక ఎంతో గుండె ధైర్యంతో నీకు నివే ఆహుతైన వాడ 60ఏళ్ల తెలంగాణ పోరాటానికి దారి చూపినవాడు శ్రీకాంతాచారి అని మలి దశ ఉద్యమకారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉడుత గంగాధర్, ఎర్రవట్టి సాయిబాబా, గంజివర్ చందు, దండు విజయ్, భీమా నాయక్, రాజు,కృష్ణ, మారుతి, పవన్, తదితరులు పాల్గొన్నారు.

నంది పేట: నందిపేట మండల కేంద్రం లోని పాతబస్టాండ్ సమీపంలో మంగళవారం తెలంగాణ మలివిడత ఉద్యమంలో అమరుడైన శ్రీకాంతచారి వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శ్రీకాంతచారి ప్రాణత్యాగాల వల్ల తెలంగాణ రాష్ట్రం ఏర్పడిం దని వక్తలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ కె.గంగాధర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ హుస్సెన్, మాజీఎంపీటీసీసభ్యుడు మనోజ్‌రావు, గంగా ధర్, నాయకులు సురేష్, కొత్తూరు భాస్కర్, పాశ, తదితరులు ఉన్నారు.

నవీపేట: ప్రత్యేక తెలంగాణ సాధనకై మలిదశ ఉద్యమంలో అసువులు బాసిన దాసోజు శ్రీకాంతా చారి 15వ వర్ధంతి వేడుకలను మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మండల విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో దాసోజు శ్రీకాంతా చారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఆయన చేసిన పోరాటాని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షులు భూమాచారి, కాళిదాసు, శ్రీనివాస్, శివ, ప్రశాంత్, వినోద్, ప్రకాష్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్: బీర్కూర్ మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు శ్రీకాంత్ చారికి ఘన నివాళులర్పించారు. శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం గాంధీచౌక్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్దకు చేరుకున్నారు. శ్రీకాంతాచారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం శ్రీకాంతాచారి తన ప్రాణాలను త్యాగంచేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

నవీపేట,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్టేషన్ ఏరియాకు చెందిన ఎల్.రాజేష్(30)అనే వ్యక్తి అదృశ్యమయ్యాడని ఎస్ఐ వినయ్ తెలిపారు.రాజేష్ గతంలో పలుమార్లు ఇంటి నుండి బయటకు వెళ్లి రెండు, మూడు నెలలకోసారి తిరిగి వచ్చేవాడని అన్నారు.ప్రస్తుతం ఆరు మాసాల క్రితం బయటకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి చేరుకోలేదని అన్నారు. రాజేష్‌కు భార్యఇద్దరుకుమారులు ఉన్నారని,రాజేష్ తల్లికళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాగుడుకు బానిసై ఒకరి ఆత్మహత్య

గాంధారి,డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):సర్వాపూర్ గ్రామానికి చెందిన ముదెల్లి పోచయ్య (45) ఆత్మహత్యచేసుకున్నట్లు ఎస్ ఐ ఆంజనేయులు తెలిపారు.సర్వాపూర్ జీపీలో వర్కర్‌గా పనిచేస్తున్నాడని గత కొన్ని సంవత్సరాలుగా తాగుడుకు బానిసై డబ్బుల కోసం భార్యనుకూడా వేదించేవాడని, ప్రతీ రోజు కూడా తన భార్యను త్రాగటానికి డబ్బులు అడగగా లేవని భార్య వినోద చెప్పగా తనను కోట్టడంత్తో ఇంట్లో నుంచి వెళ్లి పోయింది.తిరిగి భార్యవినోద ఉదయం వచ్చేసరికి ఉరివేసుకుని ఇంట్లో ఆత్మహత్యచేసుకున్నాడని తెలిపారు. మృతుని భార్య వినోద ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

లింగంపేట,డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బాణాపూర్ గ్రామానికి చెందిన బెస్త సాయిలు కూతురు అఖిల (19) కని పించకుండా పోయిందని మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.సాయిలు భార్యతో కలిసి ఈనెల 2నమాచారెడ్డి మండలం చుక్కాపూర్‌లో విందుకు వెళ్లగా అదే రోజు సాయంత్రం అఖి ల ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని గ్రామంలోను, బంధువుల ఇళ్లలోన వెతికినా ప్రయోజనం లేకపోవడంతో తండ్రిసాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ధర్పల్లి, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామడుగు గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున గ్రామంలో అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్ తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

● రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



పచ్చలనడ్కుడలో చెక్కులను అందజేస్తున్న అన్వేష్‌రెడ్డి

వేల్పూర్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): పేద, బడుగు బలహీన వర్గాల రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైనా సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేసిన అనంతరం రూ.2లక్షల రుణమాఫీ చేసినందుకు గాను సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వ హించారు. ఈ సందర్భంగా అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుగు గడ్డం నర్సారెడ్డి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు టక్కరి గంగాధర్, గ్రామశాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, నాయకులు లింగేశ్వర్, నెహ్రూ, గట్టవుతాల నర్సారెడ్డి, భూమన్న, కార్యకర్తలు, తదిరులు పాల్గొన్నారు.

నాణ్యతతో కూడిన భోజనం అందించాలి

ధర్పల్లి, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత పాటించాలని తహసీల్దార్ మాలతి సూచించారు. మంగళవారం మండలంలోని ఒన్నాజీపేట్, వాడి గ్రామాల్లో అంగన్‌వాడి సెంటర్‌లను, ప్రభుత్వ పాఠశాలలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు.మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెను ప్రకారం నాణ్యతయుతంగా విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. ప్రతీరోజు భోజనం అందించాలని ఏజెన్సీలకు ఆదేశించారు.

విశ్వకర్మలు కలిసికట్టుగా ఉండాలి



మాట్లాడుతున్న విశ్వకర్మ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరామ్ మహిపాల్‌చారి

డొంకేశ్వర్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి) విశ్వకర్మ సంఘం సభ్యులంతా కలిసికట్టుగా ఉంటే ఎటువంటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని విశ్వకర్మ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరామ్ మహిపాల్‌చారి అన్నారు. మంగళవారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో విశ్వకర్మ మండల సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం కుటుంబ సర్వేలో ఐదు కులాలకు కలిసి ఒకే కోడ్‌ను కేటాయించాలని విశ్వకర్మ సంఘాలు కోరడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో హర్షం వ్యక్తం చేశారు. కుటుంబసర్వేలో విశ్వబ్రహ్మణ కులంలో వివిధ వర్గాలకు ప్రత్యేకంగా కోడ్ ఇచ్చి లెక్కించడం వల్ల వారి జనాభా చాలా తక్కువగా నమోదు అవుతుందని అన్నారు. విశ్వకర్మ కులస్తులను వేర్వేరుగా లెక్కించడం వల్ల జనాభా సంఖ్య తగ్గి ప్రభుత్వ పథకాలు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, శ్యామ్, నగేష్, అశోక్, రాములు, బ్రహ్మయ్య, చిన్నయ్య, ప్రశాంత్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతాల్లో నిప్పు పెట్టొద్దు

మోస్రా,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మోస్రా మండలంలోని చింత కుంట గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ శిక్షణ అధికారి మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో నిప్పు పెట్టడం వల్ల నిప్పు వలన అడవులు అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. నిప్పు వల్ల అడవులలో జీవించే వన్య ప్రాణులు చనిపోతున్నాయన్నారు. అటవీకి నిప్పు పెడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అడవులను కాపాడి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అటవీ శిక్షణ అధికారి కోటేష్, బీట్ అధికారి హుస్సేన్, హరీష్, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

బోధన్ అభివృద్ధికి నిధుల మంజూరు

బోధన్‌రూరల్,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): బోధన్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ ధర్మపురి అరవింద్ 50లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ చారి తెలిపారు. బోధన్ నియోజకవర్గంపై ఎంపీ అరవింద్‌కు పట్టు ఉందని, బోధన్ నియోజకవర్గం అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. బోధన్ నియోజకవర్గానికి 50లక్షల నిధులు మంజూరు చేసి తీసుకురావడంలో తనవంతు కృషి చేసిన ఎంపీకి బోధన్ బీజేపీ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సమస్యలపై పరిష్కార వేదిక

వేల్పూర్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): వేల్పూర్, భీమ్‌గల్ మండలాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం వేల్పూర్ విద్యుత్ ఉప కేంద్రంలో సదస్సు నిర్వహించడం జరుగుతుందని ఆర్మూర్ ట్రాన్స్‌కో డీఈ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సమస్యలపై పరిష్కర వేదిక నిర్వహిస్తున్నట్లు డీఈ తెలిపారు. ఈ అవకాశాన్ని వేల్పూర్, భీమ్‌గల్ మండలాల ప్రజలు, విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

రైతులను మోసగిస్తున్న ప్రభుత్వం

● రైతు ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రైతు పండగ పేరిట రైతులను ప్రభుత్వం మోసం చేస్తుందని రైతు జేఏసీ నాయకులు విమర్శించారు. పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు వి.ప్రభాకర్, ఇట్టెడి లింగారెడ్డిలు మాట్లాడుతూ రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, నాల్గవ విడత ప్రకటించినప్పటికీ 60శాతం కూడా పూర్తి కాలేదని వారన్నారు. ఈ కార్యక్రమంలో బి.దేవరాం, భూమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


స్థానిక సంస్థల

నిధులకు గ్రహణం!



- పనులు పూర్తి చేసినా బిల్లులు పెండింగ్‌లోనే.. ● నిధుల లేమితో కుంటుపడిన గ్రామీణాభివృద్ధి పనులు
- కొత్త ప్రభుత్వంలో మంజూరు కాని నిధులు ● చేసిన పనులకు బిల్లులు లేక లబోదిబోమంటున్న కాంట్రాక్టర్లు

జిల్లా, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల నిధులకు గ్రహణం పట్టుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి జిల్లా పరిషత్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు కేటాయిస్తారు. ఇలా వచ్చిన నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, పాఠశాలల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, గ్రామీణ పారిశుధ్యం పనులు, వైద్య, విద్య కోసం నిధులు వెచ్చిస్తారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా స్థానిక సంస్థలకు రావల్సిన నిధులు గత కొన్నేళ్లుగా రాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడింది. గత పదేళ్లుగా గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు గాను ఒక్కో మండలంలో సుమారు 3 నుంచి 5 కోట్ల రూపాయల వరకు పనులు పూర్తిచేశారు. ఇందులో ప్రతీ మండలానికి సుమారు కోటి రూపాయలకు పైగా నిధులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు, కాంట్రాక్టర్ల ద్వారా తెలిసింది. కేంద్ర ప్రభుత్వం నుంచి 15వ ఆర్థిక నిధులు (ఫైనాన్స్) జిల్లా పరిషత్‌కు రావల్సిన నిధులు గత కొన్నేళ్లుగా రావడం లేదు. పైగా గత ప్రభుత్వంలో యాక్షన్‌ప్లాన్ ద్వారా మంజూరైన వివిధ పనులు పూర్తి చేసినా ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదు.2023-24కు గాను కేంద్రప్రభుత్వానికి 3కోట్ల50లక్షల నిధులకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి అధికారులు పంపారు. అయితే అందులో నుంచి కోటి 5లక్షల రూపాయలు ఇప్పటికీ రాలేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో గ్రామీణ ప్రాం తాల్లో వివిధ పనులను చేపట్టేందుకు జిల్లా పరిషత్ శాఖాధికారులు 2024- 25 కుగాను 3 కోట్ల 70 లక్షల రూపాయల యాక్షన్‌ప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. కానీ ఇంతవరకు ప్రభుత్వం ద్వారా ఎటువంటి నిధులు రాలేదు. దీంతో పనును పూర్తి చేసిన కాంట్రాక్టర్లు అప్పులపాలయ్యారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జిల్లా పరిషత్‌కు రావాలసిన ఎస్ఎఫ్‌సీ నిధులు సైతం మంజూరుకు నోచుకోలేదు. ఈ ఎస్ఎఫ్‌సీ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి పనులు చేపడ్తారు.



పనులు పూర్తి అయినా పెండింగ్‌లో బిల్లులు

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని ఆయా మండలాల పరిధుల్లో మంజూరైన వివిధ పనులను అధికారులు పూర్తి చేయించారు. పనులు పూర్తయి ఏళ్లు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వాల నుంచి రావాల్సిన బిల్లులు ఇప్పటికీ రాలేదు. దీంతో పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లు బిల్లుల మంజూరు కోసం జిల్లా పరిషత్ కార్యాలయ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో చేసిన పనులకు కొత్త ప్రభుత్వం మంజూరు చేస్తుందని భావించిన వారికి నిరాశే మిగులుతుంది. గత ప్రభుత్వ హయాంలో పూర్తిచేసిన పనులకు బిల్లులు రాకపోవడం వల్ల పనుల కోసం చేసిన అప్పులు తీర్చలేక కాంట్రాక్టర్లు నానా ఇబ్బంది పడుతున్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీ లు చెల్లించక దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అధికారుల చు ట్టూ తిరిగినా ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయన్న ఒకే ఒక్క మాట తప్ప నిధులు ఎప్పుడు వస్తాయో చెప్పలేని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారు.

నిధుల లేమితో కుంటుపడిన గ్రామీణాభివృద్ధి

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావల్సిన నిధులు రాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడింది. గ్రామీణ ప్రాంతాల్లో జిల్లాపరిషత్ ద్వారా వివిధ అభివృద్ధి పనులు చేపట్టేవారు. కానీ గత పదేళ్లుగా జిల్లా పరిషత్ శాఖకు నిధులు మంజూరు కాకపోవడంతో గ్రామాల్లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉంది. ఎటుచూసినా గుంత రోడ్లు, శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలల భవనాలే కన్పిస్తున్నాయి.

గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం

గ్రామాల్లో పారిశుధ్య పనులు స్తంభించిపోయాయి. జిల్లా పరిషత్‌శాఖ ద్వారా గ్రామాలకు కేటాయించాల్సిన నిధులు రాకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు జరుగడం లేదు. పైగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల కాల పరిమితి ముగియడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయడానికి శ్రద్ధ చూపడంలేదు. ప్రభుత్వం గ్రామాలకు ఇన్‌చార్జీలుగా కేటాయించిన ప్రభుత్వ అధికారులకు అధికారాలు ఉన్నా నిధులు లేకపోవడంతో వారు సైతం అభివృద్ధి పనులు చేయడానికి దృష్టిపెట్టడం లేదు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది.

రేషన్ బియ్యం అక్రమ రవాణాకు

అడ్డుకట్ట పడేనా?

- కొత్త రేషన్ డీలర్లను నియమించిన అధికారులు ● అవినీతికి తావు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలంటున్న ప్రజలు



మండలకేంద్రంలో నూతన డీలర్‌ను నియమించిన చౌక ధరల దుకాణం

నసురుల్లాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాలకు అధికారులు ఇంటర్వ్యూ పద్ధతిలో చౌకధరల దుకాణాలకు రేషన్ డీలర్లను నియమించారు. ఇప్పటివరకు ఒక్కో డీలర్‌కు రెండు నుంచి మూడు రేషన్ షాపులు ఉండేవి. అయితే నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత నసురుల్లాబాద్ మండలంలో ఆరు రేషన్ షాపులకు నూతన డీలర్లకు పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించి రేషన్ డీలర్లను నియమించింది. అయితే ఇప్పటి నుంచి అయినా అక్రమ రేషన్ బియ్యం రవాణాకు అడ్డుకట్టపడేనా అన్నట్లు నసురుల్లాబాద్ మండల ప్రజలు గుసగుసలాడుతున్నారు. గతంలో మహారాష్ట్ర, కర్నాటక వంటి ప్రాంతాల నుంచి కొనుగోలు చేసుకుని అక్కడికి వెళ్లి విక్రయించే వారని మండల ప్రజలు వాపోతున్నారు. అంతేకాకుండా గతంలో కొంత తమంది రైస్ మిల్లుల యజమానులు కూడా ఈ రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేయించి ప్రభుత్వానికి పంపిన దాఖలాలుకూడా ఉన్నాయి. అయితే ఇప్పటికైనా ఈ అక్రమ రేషన్ బియ్యం తరలింపును నివారించి, నిజమైన నిరుపే దలకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలని, ఒకవేళ నూతన డీలర్లు సైతం తమ జేబులను నింపుకొని డబ్బులు దండుకుందామన్న ఉద్దేశంతో పని చేయకుండా అక్రమంగా రేషన్ తరలింపునకు పాల్పడకుండా నిరుపేదలకు అన్యాయం జరుగకుండా చూడాలని నసురుల్లాబాద్ మండల ప్రజలు కోరుకుంటున్నారు. రేషన్‌డీలర్లు అవినీతికి పాల్పడితే అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వాపోతున్నారు.

రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

● ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్



నసురుల్లాబాద్ మండలంలోని ఆయా గ్రామాల రేషన్ డీలర్లు అక్రమంగా రేషన్ బియ్యం తరలించి, రవాణా చేసిన చట్టరీత్యాపరమైన కేసులతో పాటు క్రిమినల్ కేసులు బుక్ చేస్తాం.



ప్రధాన రహదారికి ఇరువైపులా కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

సంతకు స్థలం కరువు!

- రోడ్లకు ఇరువైపులా కూరగాయల అమ్మకాలు ● కూరగాయాలు కొనేందుకు వచ్చిన ప్రజలు ట్రాఫిక్ జాం
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ● పట్టించుకోని అధికారులు

రాజంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పేరుకే మండల కేంద్రంగా ఉంది తప్ప కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. గ్రామంలో ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికి అధికారులు దృష్టిసారించకపోవడంతో రోడ్లపైనే వ్యాపారులు కూరగాయాలు విక్రయిస్తున్నారు. రోజువారి సంతకు కనీస స్థలం కేటాయించలేకపోవడంతో ప్రధానరహదారికి ఇరువైపులా కూరగాయాల విక్రయాలు చేస్తుండడంతో వాటిని తీసుకునేందుకు వస్తున్న ప్రజలతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోతుంది. దీంతో ట్రాఫిక్‌జాం ఏర్పడివాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కూరగాయలు అమ్మేందుకు సంతలేదు

మండల కేంద్రానికి రోజువారిగా చుట్టుపక్కల గ్రామాల రైతులు కూరగాయాలు అమ్మేందుకు వస్తుంటారు. మార్కెట్‌యార్డు గాని స్థలం గాని లేకపోవడంతో రోడ్డుపైనే ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపారం కొనసాగిస్తున్నారు. రోజువారిగా చిన్నగా సాగిన శుక్రవారం మాత్రం పెద్దసంఖ్యలో వ్యాపారం సాగుతుంది.మండల కేంద్రంలోని రైతులతో పాటు చుట్టుపక్కల గ్రామాలైన బస్వన్నపల్లి, శివాయిపల్లి, తలమడ్ల, ఆర్గొండ,పెద్దయిపల్లి, పొందుర్తి గ్రామాల నుండి రైతులు కూరగాయాలను తీసుకువచ్చి అమ్మకాలు జరుపుతుంటారు. అయిన ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో వ్యాపారం రోడ్డుమీదనే సాగిస్తున్నారు.దీంతో తీవ్ర ట్రాఫిక్ జాం ఏర్పడి వాహనాలు కదలలేని పరిస్థితి ఏర్పడుతుంది.

మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలని వినతులు

కొత్తమండలం ఏర్పాటు అయి సంవత్సరాలు గడుస్తున్న కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. రాజంపేట మండలం సగం కామారెడ్డి నియోజకవర్గానికి, మరో సగం ఎల్లారెడ్డి నియోజకవర్గానికి వస్తుంది. ఇద్దరు ఎమ్మెల్యేలు దృష్టిసారించి మార్కెట్ యార్డు ఏర్పాటుచేయాలని విన్నవిస్తున్నారు. మార్కెట్ యార్డును ఏర్పాటుచేస్తే అక్కడే కూరగాయాలు విక్రయించేందుకు రైతులకు వీలుగా ఉంటుందని, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవనే అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

నిరుపేదల

సొంతింటి కల నెరవేరేనా?

- ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేదలు ● ప్రతీ గ్రామంలో నిరుపేదలను గుర్తిస్తున్న అధికారులు



అద్దె ఇంట్లో ఉంటున్న ఓ నిరుపేద కుటుంబం

తాడ్వాయి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రె స్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లపై పేదలు అనేక ఆశలు పెట్టుకున్నారు. తమ సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంలో నెరవేరు తుందని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. మండల ంలోని ప్రతీ గ్రామంలో ఇళ్లు లేని నిరుపేదలు రేవంత్ సర్కార్ ఇందిరమ్మ ఇల్లు త్వరలో వస్తా యని అనడంతో సొంతింటి కల నెరవేరుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగా నే మండలంలో ఇందిరమ్మ కమిటీలను నిరుపేదలను గుర్తించాలని నియమించారు. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ప్రతీ గ్రామంలో ఉన్న నిరుపేదలను గుర్తిస్తున్నారు. ఎక్కడ పోయినా ఏ ఉపన్యాసం ఇచ్చిన గ్రామాల్లో ఉన్న నిరుపేదల ప్రజలను గుర్తించి వారికి అండగా ఉంటున్నారు. నిరుపేద కుటుంబాలకు ఇండ్లు చేరే విధంగా సహాయం చేస్తానని మాట ఇస్తున్నారు. ఎమ్మెల్యే ఇచ్చిన మాటతో ఆశావహుల్లో ఇంకా నమ్మకం కుదురుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే అభయహస్తం ఆరు గ్యారంటీల పథకంలో సుమారు 10,927 దరఖాస్తులు మండలంలో మొత్తం వచ్చాయి. ఇందులో ఇళ్లు లేని నిరుపేద దరఖాస్తులే ఎక్కువగా ఉన్నాయి. మండలంలో మొత్తం 18 గ్రామాలు ఉండగా ప్రతీ గ్రామంలో వందకుపైగానే ఇళ్లు లేని నిరుపేదల కుటుంబాలు ఉన్నాయి. నిరుపేద కుటుంబాల ఎంపికలో చేతివాటం ప్రదర్శించకుండా పైరవీలు జరగకుండా ప్రతీ గ్రామంలో నిరుపేదలకు ఇల్లు అందేలా చూడాలని ఆయా గ్రామాల నిరుపే దలు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఆశతో ఉన్నాను..

● చాకలి రాజన్న, స్థానికుడు



15 సంవత్సరాలుగా అద్దె ఇంట్లోనే ఉంటున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వం లో తమకు ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఆశతో ఉన్నాను. ప్రభుత్వం తమకు ఇల్లు మంజూరు చేస్తే నిర్మించుకుంటాను.

గత 20 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే..

● మహ్మద్ గఫూర్, స్థానికుడు



గత 20 సంత్సరాలుగా ఇల్లు లేకుండా అద్దె ఇంట్లోనే ఉంటున్నాం. నాకు ఖాళీ స్థలం, ఇల్లు మంజూరు చేస్తే నిర్మించుకుంటాను. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని నమ్మకం ఉంది.



డ్రైనేజీ లేక అస్తవ్యస్థంగా ఉన్న డబుల్ గృహాలు

ఎన్నాళ్లీ తిప్పలు!?

- డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో కరెంటు కటకట ● మురుగు కాల్వల్లేక అవస్థలు

ఇందల్వాయి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి మండల కేంద్రంలో లబ్ధిదారులకు కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు అంధకారంలో మగ్గుతున్నాయి. కరెంటు లేక లబ్ధిదారులు చీకటి గృహాల్లోనే నివసిస్తున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకునే వారు కరువయ్యారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి 48 మందికి డబుల్‌గృహాలను మంజూరుచేశారు. గృహాలను ఇచ్చి సంవత్సరం గడిచిన ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయి. కరెంటు, డ్రైనేజీ లేక నానా అవస్థలు పడుతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రతీ ఇంటికి విద్యుత్ మీటర్లు ఇవ్వాల్సిన అధికారులు నేటి వరకు ఇవ్వలేదు. ఒకే మీటర్‌తో అన్ని గృహాలకు విద్యుత్ సరఫరా చేయడంతో ఎవరు ఎంత బిల్లు కట్టాలో తెలియక విద్యుత్ బిల్లు అమాంతం పెరిగిపోతుందన్నారు. దీంతో పలు మార్లు విద్యుత్ అధికారులు లైన్ కట్ చేశారు. లబ్ధిదారులు ఏం చేయాలో తెలియక ఎవరికి చెప్పాలో తెలియక చిన్న పిల్లలతో చీకటి గృహాల్లో కాలం వెల్లదీస్తున్నారు. పేరుకు మాత్రమే డబుల్ గృహాలు ఇచ్చారే తప్ప లబ్ధిదారుల సమస్యలు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కలెక్టర్, విద్యుత్ ఉన్నతాధికారులు, తహసీల్దార్‌లను కలిసి వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇందల్వాయి డబుల్ బెడ్‌రూంలలో నివసిస్తున్న లబ్ధిదారులకు విద్యుత్, డ్రైనేజీ సమస్యలు తీర్చాలని అధికారులను వేడుకుంటున్నారు.



మురుగు కాల్వలు లేక అవస్థలు

డబుల్ ఇళ్లు ఇచ్చి సంవత్సరం దాటిన ఇప్పటివరకు డ్రైనేజీ సరఫరా లేకపోవడంతో ఇళ్ల చుట్టూ మురికినీరు చేరి దుర్వాసన వస్తుందని దోమలు, ఈగలు ఇంట్లోకి చేరి రోగాల బారిన పడుతున్నామని లబ్ధిదారులు అంటున్నారు.

చీకట్లోనే గడుపుతున్నాం..

● జితేందర్, గ్రామస్థుడు



కరెంటు లేక చీకటిలో నిద్రిస్తున్నాం. మురుగు కాల్వలు లేక పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉంది. దోమలతో రోగాల బారిన పడుతున్నాం. రాత్రిపూట ఇంట్లో ఉండాలంటే చిన్నపిల్లలు భయపడుతున్నారు. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించాలి. మా సమస్యలు తీర్చాలి.

బడ్జెట్ రాగానే పనులు మొదలు పెడతాం

● ట్రాన్స్‌కో ఏఈ రాజేందర్ వివరణ

గత ప్రభుత్వంలోనే డబుల్ ఇళ్ల కోసం ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైంది. కానీ ఇప్పటి వరకు డబ్బులు రాలేదు. బడ్జెట్ రాగానే పనులు మొదలు పెడతాం.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో ఉచిత కృత్రిమ కాలు పంపిణీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం సందర్భంగా మంగళవారం పోస్టర్‌ను ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. రోటరీక్లబ్ నిర్వహించబోయే ఉచిత కృత్రిమ జైపూర్ కాలు శిబిరాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈనెల 10న ఈ శిబిరం నిజామాబాద్‌లో నిర్వహిస్తారని ఆయన తెలిపారు. కృత్రిమ కాలు అవసరం ఉన్నవారు రోటరీ క్లబ్‌ను సంప్రదించి వివరాలు అందిస్తే వారికి పదవ తేదీన అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు బీరెల్లి విజయరావు, సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై సీఎంకి అర్బన్ ఎమ్మెల్యే లేఖ

సుభాష్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరకాలం పూర్తయిన ప్రజలకు ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చలేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆరోపించారు. ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి బహిరంగ లేఖను అయన మంగళవారం విడుదల చేశారు. సంవత్సర కాలంలో ప్రజలకు ఏమి చేశారని ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆయన ఆ లేఖలో ఆరోపించారు.

బంగారు గొలుసు అపహరణ

ఖిల్లా, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి):నగరంలోని మూడవ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్‌లో కిరాణదుకాణంలో ఉన్న మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించినట్లు ఎస్ఐ.యు.మహేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఉదయం సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి తనకు సిగరేట్, థమ్సప్ తీసుకుని తాగి డబ్బులు ఇచ్చే సమయంలో ఆమె మెడలో నుంచి బంగారు గొలుసును అపహరించాడన్నారు. బాధితురాలు రజని సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దుండగుడి కోసం ఆ ప్రాంతంలోని సీసీఫుటేజీలను పరిశీలించారు. ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపారు.

వ్యాపారికి రెండు రోజుల జైలు

ఖిల్లా, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): నిబంధనలను ఉల్లంఘించి వ్యాపారం చేసిన వ్యక్తికి రెండవ క్లాస్ మెజిస్ట్రేట్ రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు మూడవ టౌన్ ఎస్ఐ యు.మహేష్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని మూడవ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని చంద్రశేఖర్‌కాలనీలో మోహన్ అనే వ్యక్తి నిబంధనలు ఉల్లంఘించి 30న దుకాణంను రాత్రి వేళ తెరచి ఉంచాడు. నిబంధనలు ఉల్లంఘించాడని మోహన్‌ను మంగళవారం ఉదయం కోర్టు ఎదుట హాజరు పర్చినట్లు చెప్పారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను మరమ్మతులు చేసి పంపిణీ చేయాలి

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్లకు మరమ్మతులు చేసి అర్హులకు పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఇటీవల సిపిఎం జిల్లా కమిటీ డబుల్ బెడ్‌రూం ఇండ్లను, రాజీవ్ గృహకల్ప సముదాయాలను పరిశీలించిందని అక్కడ అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, నూర్జహాన్, విఘ్నేష్, రాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆశాలకు లెప్రసీ, పల్స్‌పోలియో పెండింగ్ డబ్బులు ఇవ్వాలి..

డిసెంబర్‌లో లెప్రసీ సర్వే చేయాలని ఆశాలకు జిల్లా అధికారులు ట్రైనింగ్ ఇస్తున్నారని ఈ నిర్ణయాన్ని తక్షణమే ఆపాలని పల్స్‌పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించిన తర్వాతనే కొత్త సర్వే చేయించాలని సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా వైద్య అధికారి రాజశ్రీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రేణుక, రాధా, పుష్ప, సవిత, సుమలత తదితరులు పాల్గొన్నారు.

'మహేష్‌కుమార్‌గౌడ్ క్రికెట్ కప్' ప్రారంభం

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ క్రికెట్ కప్-2024 పేరుతో టెన్నిస్‌బాల్ టోర్నమెంట్‌ను మంగళవారం నగరంలోని పాలిటెక్నిక్ మైదానంలో నిజామాబాద్ ఏసిపి రాజావెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను సానుకూల దృక్పథంతో ఆడి గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. మహేష్‌కుమార్‌గౌడ్ పేరుతో క్రికెట్ టోర్నిని నిర్వహించడం గొప్ప విషయమన్నారు. నేటి యువతలో దాగి ఉన్న ప్రతిభను ఇలాంటి క్రీడాపోటీల ద్వారా బయటకు వస్తాయన్నారు. ప్రస్తుతం గ్రౌండ్‌లు లేక క్రీడలు ఆడటం లేదని ఇలాంటి టోర్నిల ద్వారా క్రీడాకారుల ప్రతిభ బయటకు వస్తుందన్నారు. వందకు పైగా జట్లు పాల్గొంటున్న ఈ టోర్ని ప్రతీ మ్యాచ్ 10 ఓవర్ల పాటు ఉంటుందని విజేతకు 30వేల బహుమతి, రన్నర్‌కు 15వేలు బహుమతి ఇవ్వనున్నట్లు నిర్వాహకులు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల వారికి పోటీలో పాల్గొనే అవకాశం ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో టిపిసిసి లీగల్ సెల్ కన్వీనర్ దయాకర్‌గౌడ్, ఎర్రం గంగాధర్, మిర్జా మజీద్ బేగ్, బిలెందర్‌సింగ్ పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలబెడతా

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బోధన్ నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే బోధన్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలబెడతానని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలో పలు అభివృద్ధి పనులకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో 15లక్షల రూపాయలతో నిర్మించిన అదనపు గదులను ప్రారంభించారు. 66లక్షలతో చేపట్టనున్న మండల ప్రజాపరిషత్ నూతన భవన పనులకు శంకుస్థాపన చేశారు. అన్ని హంగులతో ప్రభుత్వం నూతనంగా నిర్మించదలచిన సమీకృత రెసిడెన్షియల్ విద్యాసంస్థలను, వసతి గృహల సముదాయాల కోసం బెల్లాల్ సమీపంలోని మధుమలాంచ డిగ్రీ కళాశాల వద్ద స్థలాన్ని పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. అనంతరం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో డీసీహెచ్ఎస్ శ్రీనివాస్ ప్రసాద్, వైద్య అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సంధ్య, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ చీల శంకర్, పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు లాభదాయక పంటల వైపు మొగ్గు చూపాలి

రెంజల్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): రైతులు వరిపంటతో పాటు లాభదాయకమైన చెరకు, మొక్కజొన్న పంటల వైపు మొగ్గు చూపి అధిక లాభాలను ఆర్జించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మాసాపురం రోడ్డుకు 20లక్షల వ్యయంతో. శివాలయం రోడ్డుకు 6లక్షల వ్యయంతో మొరం రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఆయన వెంట టీపీసీసీ జనరల్ సెక్రెటరీ, ప్రజాపాలన విజయోత్సవ బోధన్ సమన్వయకర్త సత్యనారాయణ, గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్

పదేళ్లలో చేయలేని అభివృద్ధిని పది నెలల్లోనే చేశాం..

ఎడపల్లి: తెలంగాణ ఏర్పడ్డాక అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయలేని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన సంవత్సర కాలంలోనే చేసి చూపించిందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో పంచాయితీ భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు.

గడీల పాలన పోయి.. ప్రజాపాలన వచ్చింది

● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత పది సంవత్సరాలు కేసీఆర్ గడీల పాలన నడిపించిందని ఇప్పుడు ప్రజాపాలన నడుస్తుందని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం ముదక్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో అనేక మంది ఆత్మబలిదానాలు చేసుకుంటే దీన్ని చూడలేక సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ తన కుటుంబ పాలన నడిపించాడు తప్ప నీరు, నిధులు, ఉద్యోగాల సాధన కోసం రాష్ట్రం ఏర్పడితే చక్కదిద్దాల్సిందిపోయి నిర్బంధ పాలన కేసీఆర్ కొన సాగించారని మండిపడ్డారు. సమావేశంలో శేఖర్‌గౌడ్, భాగారెడ్డి, సాయరెడ్డి, ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లి గ్రామంలో ఉన్న పెద్దమ్మ ఆలయం అభివృద్ధి కోసం కృషి చేస్తానని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. పెద్దమ్మ ఆలయం వార్షికోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి 10లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ శేఖర్‌గౌడ్, నాయకులు భాగారెడ్డి, భోజన్న, పార్టీ అధ్యక్షుడు సాయరెడ్డి, సొసైటీ చైర్మన్లు మోహన్‌రెడ్డి, గంగారెడ్డి, రమేష్, రాజాకిషన్, పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ అధ్యక్షులు గాండ్ల శ్రీనివాస్, కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు భూమన్న, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఏడాది పాలనపై కాంగ్రెస్ నాయకులు సంబరాలు

డిచ్‌పల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా రాంపూర్ గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దత్తాద్రి, ఆధ్వర్యంలో యువకులు సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



రిజర్వాయర్ పనులు పరిశీలిస్తున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి

రిజర్వాయర్ పనులను పూర్తి చేయాలి

● పోచారం శ్రీనివాస్ రెడ్డి

వర్ని, కోటగిరి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మెట్ట భూములకు పుష్కలంగా సాగునీరు అందించేందుకు తలపెట్టిన సిద్దాపూర్ రిజర్వాయర్ పనులు త్వరితగతిన పూర్తి చేసి వచ్చే వర్షాకాలం కల్లా సాగునీరు అందేలా కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్ని మండలంలోని సిద్దాపూర్ రిజర్వాయర్ పనులను మంగళవారం పోచారం శ్రీనివాస్ రెడ్డి తనిఖీ చేశారు. నాలుగు అనకట్టల నిర్మాణ పనులను మరింత వేగంగా జరిపించాలని సూచించారు. రిజర్వాయర్‌ను 258కోట్ల వ్యయంతో ఒక టీఎంసీ కెపాసిటితో నిర్మిస్తున్నామన్నారు. పనుల నిర్మాణంలో వేగం పెంచాలని సూచించారు. ఆయన వెంట రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, అధికారులున్నారు.

కాపర్‌వైర్ దొంగల అరెస్ట్

ఖిల్లా, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రైల్వే పనుల కోసం తీసుకొచ్చిన సుమారు లక్షా 28వేల విలువ గల ఎలక్ట్రిక్ కాపర్‌వైర్‌ను అపహరించిన ముగ్గురు దుండగులను అరెస్ట్ చేసి వారి నుంచి సొమ్మును స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే పోలీసు ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. వివరాలను మంగళవారం రైల్వే స్టేషన్‌లో ఇన్స్‌పెక్టర్ తావునాయక్, రైల్వే ఎస్ఐ సాయిరెడ్డితో కలిసి విలేకరులకు వెల్లడించారు. మెదక్ జిల్లాలోని లక్ష్మీపూర్, సమ్మపూర్ మధ్య జరుగుతున్న రైల్వే పనుల కోసం ఇందూస్ ప్రాజెక్ట్ ప్రైవేటు లిమిటెడ్ వారు తీసుకొచ్చిన కాపర్ వైర్‌ను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఈనెల 19న అపహరించారని ఆ కంపెనీ సూపర్‌వైజర్ ప్రవీన్ ఫిర్యాదు చేశారన్నారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి విచారణ చేశామన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అవినీతి నిరోధక శాఖ పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్


నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక శాఖ వారోత్సవాల్లో భాగంగా ఏసీబీ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను మంగళవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. లంచం ఇవ్వకండి మాకు సమాచారం ఇవ్వండి అని డయల్ 1064 టోల్‌ఫ్రీ నెంబర్‌తో కూడిన పోస్టర్లను రూపొందించగా కలెక్టర్ ఆవిష్కరించారు. అవినీతిని నిర్మూలిద్దాం... దేశాన్ని అభివృద్ధి చేద్దాం... అని ఎవరైనా లంచం అడిగితే ఏసిబి డిఎస్పీ నిజామాబాద్ 9154388950, ఇన్స్‌పెక్టర్లు 9154388951, 9154388953 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసిబి డీఎస్పీ శేఖర్‌గౌడ్, ఇన్స్‌పెక్టర్లు నగేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి సీపీ..

ఖిల్లా: అవినీతి నిరోధక శాఖ వారోత్సవాల్లో భాగంగా ఆశాఖాధికారులు ఏర్పాటు చేసిన పోస్టర్లను మంగళవారం ఇంచార్జీ పోలీసు కమిషనర్ సింధూశర్మ ఆవిష్కరించారు. అనంతరం ఈ పోస్టర్లను ప్రజల అవగాహన కోసం రద్దీగా ఉండే ప్రాంతాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో అతికించారు. లంచం అడుగడంతో పాటు లంచం ఇవ్వడం కూడా నేరమని అధికారులు తెలుపుతూ పోస్టర్లను రూపొందించారు. ఈ సందర్భంగా ఏసీబి డిఎస్పి శేఖర్‌గౌడ్, ఇన్స్‌పెక్టర్లు నగేష్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. ప్రజలు ఫిర్యాదు చేయాల్సిన నంబర్లు. డిఎస్పీ-9154388950,ఇన్స్‌పెక్టర్లు-9154388951, 9154388953, 9154388923తో పాటు టోల్‌ఫ్రీనంబరు.1064లకు సంప్రదించాలన్నారు.

జాతీయ రహదారిపై చిరుతను ఢీకొన్న వాహనం

డిచ్‌పల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి మండలం చంద్రయన్ పల్లి గ్రామ శివారు 44వ జాతీయ రహదారి అటవీ ప్రాంతం నుంచి రోడ్డుపైకి వస్తున్న చిరుతను గుర్తు తెలియని వాహనం మంగళవారం సాయంత్రం ఢీకొనడంతో చిరుత పులి స్వల్పంగా గాయాలపాలైంది. వెంటనే స్థానికులు అటవీశాఖ అధికారులు సమాచారం అందించారు. ప్రమాదంలో గాయపడ్డ చిరుత తిరిగి అటవీ ప్రాంతంలోకి వెళ్లిందని ప్రయాణికులు, స్థానికులు తెలిపారు. కాగా, ఈ ప్రమాద సమయంలో తీసిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.



చంద్రయన్‌పల్లి వద్ద చిరుతను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

ఎస్‌జీఎఫ్ జాతీయ హాకీ క్రీడా పోటీలకు తూంపల్లి విద్యార్థి ఎంపిక

సిరికొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ హాకీ క్రీడా పోటీలకు మండలంలోని తూంపల్లి హైస్కూల్ విద్యార్థిని బాదవత్ అఖిల ఎంపికయి నట్లు పీడీ నగేష్ తెలిపారు. నవంబరు 29 నుంచి డిసెంబరు 1 వరకు హుజురాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో అఖిల ప్రతిభ చూపించడంతో పాటు జిల్లా జట్టును ద్వితీయ స్థానంలో నిలపడంలో క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారని ఆయన తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగు పర్చాలి

సిరికొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపరిచి పేదలకు వైద్యాన్ని అందుబాటులోకి తీసుకరావాలని ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గోదావరి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆమె వెంట డివిజన్ అధ్యక్షురాలు రమ, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు అనిష్ తదితరులు ఉన్నారు.



అగ్ని ప్రమాదంలో ఎగిసిపడుతున్న మంటలు

భారీ అగ్నిప్రమాదం

● షార్ట్ సర్క్యూట్‌తోనే మంటలు అంటున్న స్థానికులు
● పూర్తిగా దగ్ధమైన నాలుగు గృహాలు
● సుమారు రూ.20లక్షల ఆస్తి నష్టం
● ఆదుకోవాలని బాధితుల వేడుకోలు

మెండోర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో నాలుగు నివాసాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. మండల కేంద్రంలోని గుండెటి శ్రీనివాస్, తక్కల సాయన్న, గొల్ల దేవేందర్, గొల్ల దేవమల్లు నివాసాలు పూర్తిగా మంటల్లో కాలిపోయాయి. అగ్ని ప్రమాదం విషయాన్ని కాలనీవాసులు బాల్కొండ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొనే లోపు నాలుగు నివాసాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. షాట్ సర్క్యూట్ కారణమా ? లేదా మరే ఇతర కారణమా అనేది తెలియాల్సి ఉంది. కాలనీవాసులు మాత్రం షాట్ సర్క్యూట్ కారణంగా అయి ఉండవచ్చని బావిస్తున్నారు. కళ్ల ముందే నివాసాలు కాలిబుడిద అవుతుండడంతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. వస్తువులు పూర్తిగా కాలిబుడిద కావడంతో సుమారు రూ.20లక్షలపైనే ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో జిల్లా మహిళా శిశు దివ్యాంగుల వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్, గ్రేసి ఆర్గనైజేషన్ ఫర్ డెవలప్‌మెంట్ సర్వీసెస్, ఏపి ఫోరమ్ ఫర్ ఎకనామికల్లీ వీకర్ సెక్షన్ మొదలైన స్వచ్ఛంద సంస్థలచే నడుపబడుతున్న ప్రత్యేక పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న దివ్యాంగ బాలబాలికలు యోగా, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి అలరించారు. ఈ సందర్భంగా వివిధ కేటగిరిలకు చెందిన ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న దివ్యాంగ ఉద్యోగులను, నిరుద్యోగులను ప్రశంసాపత్రాలతో సన్మానించారు. వివిధ రకాల పోటీలలో గెలుపొందిన దివ్యాంగ విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, జిల్లా న్యాయసేవాధికారిని పద్మావతి, మహిళా కమీషన్ సభ్యురాలు సూదం లక్ష్మీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని రాజశ్రీ, డిఆర్‌డివో సాయాగౌడ్, సిద్ధయ్య, జిల్లా మహిళా శిశుసంక్షేమ అధికారిని రసూల్‌బీ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

సుభాష్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ సైక్లింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి తెలిపారు. జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్‌లో మంగళవారం ఉదయం ఈ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో అత్యంత ప్రతిభకనబర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అండర్-17 బాలుర విభాగంలో ఆర్.మనీష్, రాజీబాబా, మాస్‌స్టార్ట్ విభాగంలో రాథోడ్ కార్తీక్, సీహెచ్ అఖిల్‌రెడ్డిలు ఎంపికైనట్లు తెలిపారు. వీరిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఈ ఎంపికల కార్యక్రమంలో సైక్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా కార్యదర్శి విజయ్ కాంత్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించి ఆటోలు నడపాలి

ఖిల్లా, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటిస్తూ ఆటోలు నడపాలని ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ పి.ప్రసాద్ అన్నారు. మంగళవారం నగరంలోని ట్రాఫిక్ స్టేషన్‌లో ఆటోలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆటోవాలలా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆటో డ్రైవర్ వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలను ఉంచు కోవాలన్నారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందిగా ఉండే విధంగా ఆటోలను రోడ్డుపై పార్క్ చేయరాదన్నారు. ఆటోలకు ఇన్స్ రెన్సు తప్పకుండా చేయించుకోవాలన్నారు.నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సదస్సులో ట్రాఫిక్ ఎస్ఐ సుమన్, ఆటో యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.



చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.190	రూ.270	రూ. 295
వెన్‌కాబ్ (కిలో)	: రూ.200	రూ.280	రూ. 305



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.79100	రూ.73000	రూ.945

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్ర్కీన్-1 : అమరన్ (12.35, 7.00, 10.30)
: భైరతీ రనాగల్ (4.05)
స్ర్కీన్-2 : మోనా-2 (ఇంగ్లీష్ 3డి) (11.00, 1.25, 6.45, 9.10)
: కేశవచంద్ర రమావత్ (3.50)
స్ర్కీన్-3 : ఝూన్సీ ఐపీఎస్ (10.05)
: ఫస్ట్ కేస్ ఆఫ్ ఉద్యేగం (1.25)
: ఇష్క్ (4.10)
: లక్కీ భాస్కర్ (7.25)
: జీబ్రా (10.40)
స్ర్కీన్-4 : కేశవచంద్ర రమావత్ (10.05)
: రోటీ కపడ రొమాన్స్ (1.00, 7.45)
: ఉక్కు సత్యాగ్రహం (4.15)
: భైరతీ రనాగల్ (10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1: అమరన్ (10.25)
: భైరతీ రనాగల్ (1.30, 7.35)
: రోటి కపడ రొమాన్స్ (4.30, 10.30)
స్ర్కీన్-3 : మోనా-2 (ఇంగ్లీష్ 3డి) (11.00)
: ఇష్క్ (1.30)
: ది సబర్మతి రిపోర్ట్ (హిందీ) (4.30)
: అమరన్ (7.30, 10.30)

దేవి: జీబ్రా (11.15, 6.15)
: మెకానిక్ రాకీ (2.15, 9.15)
నటరాజ్ : అమరన్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్: ఇష్క్ (11.15, 2.15,6.15, 9.15)
లలితామహల్ : భైరతీ రనాగల్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్